క్లుప్తంగా

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన శనిగరపు మొగిలి ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ ఫోన్‌ను రికవరి చేసి మొగిలికి మంగళవారం అందజేశారు. సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అప్పగించిన పోలీసులు కోమల, మమత, లాల్‌సింగ్‌లను ఎస్సై శ్రావన్‌కుమార్, సెకండ్ ఎస్సై శాఖాన్ అభినందించారు.

'నిర్లక్ష్యంగా ఎక్సైజ్ అధికారులు'

కాటారం: మహాముత్తారం మండలంలోని మారుమూల గ్రామాల్లో మద్యం ఏరులైపారు తుంటే ఎక్సైజ్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. గ్రామాల్లో బెల్టుషాపులు పుట్టగొడు గుల్లా పుటుకొస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదని కనీసం దాడులు చేసిన దాఖలాలు లేవన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి గ్రామాల్లో బెల్టుషాపులను కట్టడి చేయాలని లేకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

పలిమెల: కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్-నిజామాబాద్ గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన గ్రాడ్యుయేట్స్, టీచర్లు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సయ్యద్ సర్వర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక నమోదు కేంద్రం ఏర్పాటు చేసినట్లు వివరించారు. నవంబర్ 6లోగా అర్హులందరూ దరఖాస్తు చేసుకోని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండల కమిటీ ఎన్నిక

కాటారం: మహాముత్తారం మండల సీపీఎం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా పోలం చిన్నరాజేందర్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా గట్టు శంకర్, సభ్యులుగా మానేటి బాబు, కుంజాం బుధరామ్, మడకం భద్రయ్య, మల్లయ్య, ఉంగమ్మ, సునీత, దేవేందర్, పద్మ, మాడయ్య, లక్ష్మయ్య, మల్లేశ్, శ్రీను, రమేశ్ ఎన్నికయ్యారు.

సరుకుల పంపిణీ



రేగొండ: మండల కేంద్రంలో కోలేపాక సరోజన ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను పోలీస్ సిబ్బంది పరామర్శించి, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లింగమూర్తి, కానిస్టేబుల్ ప్రవీణ్, శ్రీధర్ పాల్గొన్నారు.

పరామర్శ



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన బుర్ర మహేశ్‌గౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని చిట్యాల సీఐ గన్‌మెన్ పులి అశోక్ పరామర్శించి 50 కేజీల బియ్యం అందజేశారు.

ఎదగని పత్తి చేను

- అధిక వర్షాలతో తెగుళ్ల బారిన పంట
- పెరిగిన పెట్టుబడి ఖర్చులు
- ఆందోళనలో రైతులు



రామకిష్టాపూర్(టీ)లో ఎదగని పత్తి పంట



ఎర్రబారిన పత్తి మొక్క

టేకుమట్ల: వ్యవసాయ రంగంలో ఎక్కువగా రైతులు పత్తి పంటనే సాగు చేస్తున్నారు. మండలంలో 8,346 ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. వరుస వర్షాల వల్ల ఆశించిన స్థాయిలో పత్తి దిగుబడి వచ్చే లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల పత్తి పంట ఎదగక పోవడంతో పాటు, వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా మొక్కకు ముడత తెగులు ఆశించి ఎదుగుదలతో పాటు, దిగుబడి సైతం తగ్గిందని రైతులు అంటున్నారు.

పెరిగిన పెట్టుబడి

పత్తి పంట సాగు చేసేందుకు ఒక్కో ఎకరాకు ఇప్పటి వరకు సుమారు రూ.25వేలకు పైగా పెట్టుబడి పెట్టినా ఎకరాకు కనీసం 10 క్వింటాళ్లు పత్తి దిగుబడి అసాధ్యమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక కౌలు రైతులు పరిస్థితి మరీ దారుణంగా మారింది. కౌలుతో పాటు, పెట్టుబడి తలకు మించిన భారంగా మారింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ప్రతికూల వాతావరణంతో తెగుళ్లబారిన పడడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు తీవ్ర మనోవేదనతో ఉన్నారు. ప్రస్తుతం కొత్త పత్తి ధర రైతుకు అనుకూలంగా ఉన్నా, రానున్న రోజుల్లో పత్తి ధర తగ్గితే అప్పు భారం తప్పదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టాన్ని దృష్టిలో ఉంచుకోని ప్రభుత్వం పత్తి మద్దతు ధరను రూ.10వేలు కేటాయిస్తే రైతులకు కొంత మేర నష్టాల నుంచి తేరుకుంటారని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఎర్రబారుతుంది..



నాకున్న ఎకరం న్నర భూమిలో పత్తి పంటను సాగు చేశాను. వర్షాల కారణంగా భూమిలో పదును ఆరడం లేదు. దీంతో పత్తి మొక్క ఎదగకపోవడంతో మొక్క ఎర్రబారుతుంది. అంతే కాకుండా ముడత రావడంతో తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఇప్పటి వరకు పంటకు పెట్టిన పెట్టుబడి వచ్చినా చాలు.

- కనకం సాంబయ్య, రైతు పంగిడిపల్లి

భర్త ప్రోత్సాహంతో కొలువు



సోమిడి స్వామి-కరుణ



పెండెల మహేందర్-రాగసుధ

టేకుమట్ల: వివాహ అనంతరం చాలా మంది మహిళలు ఇంటికే పరిమితమవుతున్నారు. కానీ వివాహం చేసుకున్న తర్వాత భార్యను ఉన్నత చదువులు చదివించి సంఘంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం కల్పిస్తున్న వారు మాత్రం కొంత మంది ఉన్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సోమిడి స్వామికి 2015లో కరుణతో వివాహం జరిగింది. కరుణ బీఫార్మసీ పూర్తి చేయగా ఆమెను ఉపాధ్యాయురాలు చేయాలనే సంకల్పంతో భర్త స్వామి డీఎడ్ చదివించి డీఎస్సీకి సన్నద్ధం చేపించారు. కాగా, ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీ ఉద్యోగం సాధించింది. అలాగే మండల కేంద్రంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పెండెల మహేందర్‌కు 2016లో రాగసుధతో వివాహం జరిగింది. రాగసుధ డీఎడ్ పూర్తి చేయడంతో ఉద్యోగం సాధిస్తుందనే నమ్మకంతో డీఎస్సీకి భర్త మహేందర్ దరఖాస్తు చేశారు. టెట్‌లో 142 మార్కులతో పాటు, డీఎస్సీ ఫలితాల్లో 81.93 స్కోర్‌తో ఎస్‌జీటీగా జిల్లా ప్రథమ స్థానంలో నిలిచి ఉద్యోగం సాధించింది. కాగా వీరు (నేడు)బుధవారం నియామక పత్రాలు అందుకోనున్నారు.

పోలీస్ టు టీచర్



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న తాళ్లపల్లి సంపత్ ఎస్జీటీ టీచర్ కొలువుకొట్టాడు. 2020బ్యాచ్‌కి చెందిన సంపత్ స్వగ్రామం హనుమకొండ జిల్లా ములకనూర్, తల్లిదండ్రులు హైమ-కైలాసం. కాగా, ఇటీవల వెలుబడిన డీఎస్సీ ఫలితాల్లో హనుమకొండ జిల్లా ఎస్జీటీలో 29వ ర్యాంకు సాధించాడు. దీంతో పోలీసు కొలువు నుంచి ఉపాధ్యాయ వృత్తికి మారుతుండడంతో కుటుంబ సభ్యులు, తోటి పోలీసులు అభినందనలు తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్, సిబ్బంది

కాటారం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్య అధికారులు, సిబ్బంది సూచించారు. మండలంలోని దస్తగిరిపల్లితో పాటు పలు గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రై డే నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటా తిరిగి జ్వర సర్వే చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత, మురుగునీరు నిల్వకుండా, దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల జ్వరపరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం దస్తగిరిపల్లిలో వైద్య శిబిరం నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు వ్యాధులతో బాధపడుతున్నవారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యురాలు డాక్టర్ ప్రియాంక, హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్ఎం రజిత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి



వాజేడు: ఏఈతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట్రావ్



వెంకటాపురం(కె): చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

వాజేడు: మరమ్మతు గురైన ట్రాన్స్‌ఫార్మర్లను త్వరగా మరమ్మతు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అధికారులకు సూచించారు. ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మత్తులకు గురి కావడంతో పంటలకు సాగు నీరు అందక పడుతున్న విషయాన్ని రైతులు ఎమ్మెల్యే వెంకట్రావ్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్థానిక సబ్ స్టేషన్‌కు ఎమ్మెల్యే మంగళవారం రైతులతో కలిసి వెళ్లారు. ఏఈ అర్షద్ అహ్మదుతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. అనంతర ఫోన్‌లో విద్యుత్ శాఖ సీఎండీతో మాట్లాడి త్వరిత గతిన ట్రాన్స్ ఫార్మర్లను మరమ్మతులు చేసి రైతులకు సాగు నీరు అందేలా చూడాలని తెలిపారు. కొంగాల వాగు సమీపంలో పూర్తి కాకుండా ఉన్న రహదారి పనులను వెంటనే చేయించాలని సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు విశ్వనాథ ప్రసాదరాజు, జగన్నాథ రాజు, జిల్లా ప్రధాన కార్య దర్శి విక్రాంత్, వాసు, నాగేశ్వరావు, షాబీర్ పాష, రాంబాబు, పుష్పలత ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి ద్వారా వచ్చిన డబ్బులను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. తహసీల్దార్ వీరభద్ర ప్రసాద్, ఎంపీడీఓ విజయ, అధికారులు, నాయకులు ఉన్నారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, సొసైటీ చైర్మన్ మోహన్ రావు, కాంగ్రెస్ నాయకులు సునీల్, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే తెల్ల వెంకట్రావ్ అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత మండల స్థాయిని నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ అంతర్జాతీయ స్థాయికి చేరుకోవాలన్నారు.

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు



అంబేద్కర్ స్టేడియంలో పనులు ప్రారంభిస్తున్న పాలకవర్గ సభ్యులు

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపల్ పరిధిలో బతుకమ్మ, దసరా పండుగ ఏర్పాట్లను మంగళవారం ప్రారంభించారు. అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించే దసరా ఉత్సవాలు, రావణాసురవధ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణిసిద్దు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. పలు కాలనీలు, విలీన గ్రామాల్లో బతుకమ్మ ఆట స్థలాలను చదును చేయించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు సరోజన, శ్రీనివాస్, మురళీధర్, రేణుకలు పాల్గొన్నారు.

వైద్యసిబ్బందిపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): ఆదివాసీ మహిళపై నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రాణాల మీదకు తీసుకువచ్చిన వైద్యసిబ్బందిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం డాక్టర్ సూర్యకు, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. సెప్టెంబర్ 24న వెంకటాపురం(కె) ప్రభుత్వ వైద్యశాలలో చింత భువనేశ్వరికి ప్రసవం చేశారు. అప్పై ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఏటూరునాగారం అక్కడి నుంచి ములుగు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం వైద్యశాలకు రిఫర్ చేశారు. అక్కడి నుంచి సీకేఎం ఆస్పత్రికి రిఫర్ చేయగా అక్కడ పరీక్షలు నిర్వహించి గర్భసంచి, మూత్ర నాళం, పొత్తి కడుపు కింద భాగం, వెన్నుపూస భాగాల్లో పలు సమస్యలు తలెత్తినట్లు నిర్ధారించారని తెలిపారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ప్రమాదకరంగానే ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విధులకు అందుబాటులో ఉండాల్సిన వైద్యాధికారి లేకపోవడం, సిబ్బంది ప్రసవం చేయడం మూలంగానే ఇలాంటి సమస్య తలెత్తిందని వారు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి చింత భువనేశ్వరి ప్రాణాల మీదకు తెచ్చిన సిబ్బందిపై చర్యలను తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. రామచందర్ రావు, సతీష్, సోమరాజు, మానేశ్వరావు ఉన్నారు.

మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు



మొగుళ్లపల్లి: పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు



తిమ్మంపేటలో..

మొగుళ్లపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో కొలువుదీరిన దుర్గామాత మంగళవారం ఆరోవ రోజు మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వేణవంక నవీన్, ప్రసాద్, భజనమండలి సభ్యులు అన్నారెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లోని అమ్మవారు మహాలక్ష్మి దేవి అలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చింది. మండల కేంద్రంలోని ఉమా చంద్రశేఖరస్వామి ఆలయంలో అర్చకులు విస్సావజ్జుల నరేష్‌శర్మ ఉమాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిమను కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీరూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మండలంలోని తిమ్మంపేటలో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి అష్టలక్ష్మి పూజాకార్యక్రమాన్ని నిర్వహించారు. రాజుపేట శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం, రమణక్కపేటలో మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శమిచ్చారు. కమలాపురం, మల్లూరు, నర్సింహాసాగర్, చెరుపల్లి తదితర గ్రామాల్లో లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారి ప్రతిమలను భక్తులు దర్శించుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

'ఫసల్ బీమా'తో రైతులకు పరిహారం



మాట్లాడుతున్న కృష్ణాకర్

ములుగు రూరల్: కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంటలు నష్టపోతే ఫసల్ బీమా యోజన పథకం ద్వారా పరిహారం అందిస్తుందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణాకర్ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ధాన్యానికి మద్దతు ధర రెట్టింపు చేసిందని అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక బీజేపీ ప్రభుత్వంపై బురదజల్లె ప్రయత్నం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, రాజ్‌కుమార్, కుమార్, దొంతిరెడ్డి రవిరెడ్డి, నాగరాజు, భిక్షుగౌడ్, సారయ్య , కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా బీఆర్ఎస్



ఎస్ఎస్ తాడ్వాయి: ఆర్థిక సాయం అందజేస్తున్న నాగజ్యోతి



ములుగు రూరల్: నివాళులర్పిస్తున్న నాగజ్యోతి

ఎస్ఎస్‌తాడ్వాయి: బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న మండలంలోని బీరెల్లి గ్రామానికి చెందిన మంతెన సందీప్ కుటుంబాన్ని ఆమె పార్టీ నాయకులతో కలిసి మంగళవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందిన సందీప్ కుటుంబానికి ఎల్లవేళలా ఉండగా ఉంటామన్నారు. మాజీ సర్పంచ్ జాజ చంద్రం, మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బండెల తిరుపతి, నాయకులు నూశెట్టి రమేష్, రోశయ్య, రాములు, నర్సింగారావు, రాము, కిషోర్, బాబు, మధు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ములుగు రూరల్: మండలంలోని జగ్గన్నపేట పంచాయతీ పరిధి చిన్నగుంటూర్‌పల్లి గ్రామానికి చెందిన పారెండుల సచిన్ డెంగీతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి మంగళవారం పరామర్శించారు. సచిన్ మృత దేహాకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె వెంట ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పోరిక విజయరాంనాయక్, సానికోమ్ము ఆదిరెడ్డి, గట్టు మహేందర్, సంజీవ తదితరులు ఉన్నారు.

అమ్మా లేమ్మా..!



మృతి చెందిన తల్లికోతిని లేపుతున్న పిల్లకోతి

కాళేశ్వరం: కాళేశ్వరం-మహదేవపూర్ జాతీయ రహదారి మార్గమధ్యలోని అన్నారం క్రాస్ వద్ద మంగళవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని తల్లి కోతి మృతి చెందింది. దీంతో మృతిచెందిన తల్లి కోతిని పిల్ల కోతి లేపుతున్న దృశ్యాలు అందర్నీ కలిచివేశాయి. తల్లి రోడ్డుపై పడుకుని ఉందనుకొని పిల్ల కోతి లేపుతూ.. తల్లి చను పాలను తాగుతుంది. ఆ మార్గంలో వెళ్లే వారిని ఆ దృశ్యాలు కంటతడి పెట్టించాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



ఏటూరునాగారం: రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురంలో ప్రధాన రాహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టాటా మ్యాజిక్ వాహనం, ద్విచక్రవాహనం ఎదురురెదురుగా వస్తూ ఆకులవారిఘణపురం వద్ద ఢీకొన్నాయి. దీంతో మండలంలోని రొయ్యూర్ గ్రామానికి చెందిన ఆకుదారి లక్ష్మణ్‌కు గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు.